మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

బహిరంగ సభకు హాజరైన అశేష జనం







పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం, మంత్రులు

# జల పండుగ..

- సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు
- నా జన్మ ధన్యమైంది.. మనస్సు పులకించింది..
- కృష్ణాజలాల్లో మన వాటా తేల్చని మోడీ ప్రభుత్వం
- తెలంగాణ శత్రువులు ఇక్కడే ఉన్నారు..
- ఉమ్మడి పాలమూరులో 20లక్షల ఎకరాలకు నీరందాలి..
- పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతికి అంకితం
- బహిరంగ సభలో సీఎం కేసీఆర్
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు

***తెలంగాణలో మరో అద్భుత దృశ్యం..అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దశాబ్దాలుగా సాగునీటి కలలుగన్న పాలమూరు ప్రజల స్వప్నం సాకారమైంది. బీడు భూములకు పరుగుపరుగున కృష్ణమ్మ పరవళ్లు తొక్కనున్నది. సీఎం కేసీఆర్ మానస పుత్రిక పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని మొదటి పంప్ నార్లాపూర్ వద్ద స్విచ్ ఆన్ చేసి ప్రాజక్టును జాతికి అంకితం చేశారు. 145మెగావాట్ల సామర్థ్యం ఉన్న మహాబాహుబలి మోటార్లను ఆన్ చేసి అంజనిగిరికి చేరిన కృష్ణాజలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.***

మహబూబ్‌నగర్ బ్యూరో/ నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త ః సువర్ణ అక్షరాలతో లిఖించాల్సిన రోజు ఇది.. పాలమూరు బిడ్డ అంటే హైదరాబాద్‌లో అడ్డా కూలి అని పేరు పడింది. మరి ఇప్పుడు ఇతర రాష్ట్రాలైన రాజస్థాన్,మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రా, ఒరిస్సా నుంచి మన వద్దకు వలస వస్తున్నారు..ఇంత మార్పు ఎలా సాధ్యమైంది..ఒక్కసారి ఆలోచించాలి.. పాలమూరు వజ్రపు తునక..ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20లక్షల ఎకరాలకు సాగునీరివ్వడే నా లక్ష్యం..ఇచ్చి తీరుతాం..ఇది నా శపథం..అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ వద్ద మొదటి మోటార్ స్విచ్ ఆన్ చేసి పైలాన్ ఆవిష్కరించి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అనంతరం డెలివరీ సిస్టర్న్ వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాలలో కృష్ణాజలాలను తీసుకొని మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎమ్మెల్యేలకు అందజేశారు. అనంతరం కొల్లాపూర్ -సింగోటం క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి తన ప్రసంగించారు.

ఉద్యమ సమయంలో పాలమూరు జిల్లాలో అనేక పర్యటనలు చేసినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నట్లు గుర్తుచేశారు. అలంపూర్ ప్రాంతంలో పర్యటించినప్పుడే తాను మాట ఇచ్చానని, మన నీళ్లు, నిధులు, హక్కులు సాధించుకుంటామని చెప్పారు. పాలమూరు ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించానని ఇది ఒక చరిత్ర అని జిల్లాకు ఆ కీర్తి ఎప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే మూడు పెద్ద ప్రాజెక్టులు, కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల అనుకున్నట్లు చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా కాళేశ్వరం పనులు పూర్తయ్యాయని, సీతారామ ఎత్తిపోతల పనులు చకచక సాగుతున్నాయన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం కూడా నాలుగు నెలల కిందటే పూర్తయ్యేదని, ఇక్కడి ఇంటిదొంగలు, చేతకాని దద్దమ్మలు కేసులు వేయడంతో ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. 1975లో బచావత్ ట్రిబ్యునల్ తీర్పు సమయంలో తెలంగాణ నుంచి ఒక్క నాయుడు నీళ్ల కావాలని అడగలేదని చాలా బాధాకరమైన సందర్భమన్నారు. ఈ ప్రాంతం ఆంధ్రాలో కలువకుంటే బాగుపడుతుంటే అని స్వయంగా సుప్రీం కోర్టు జడ్జి బచావత్ అన్నారని గుర్తుచేశారు. జూరాల ప్రాజెక్టు కూడా తాము సూచించిన చోటే కట్టాలని రికార్డుల్లో ఉన్నా పట్టించుకోలేదన్నారు. అది కూడా 1981 వరకు ఎవరూ తట్టెడు మన్ను కూడా తీయలే అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంజయ్య పునాదిరాయి వేశారన్నారు. 2001లో గులాబీ జెండా ఎగిరాక మహబూబ్‌నగర్ మీటింగ్‌లో కేసీఆర్ గర్జిస్తే ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని చెప్పారు. సమైక్య రాష్ట్రంలోనే సమగ్రాభివృద్ధి అని చెప్పిన అప్పటి సీఎం చంద్రబాబు పాలమూరును దత్తత తీసుకుని, ఎందుకు జూరాల నింపలే అని చాలా సభలో నిలదీశానని గుర్తుచేశారు. ఆర్డీఎస్ 1954లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడకముందే ప్రారంభించారని గుర్తుచేశారు. తాను మొదటగా అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారికి దండ పెట్టి పాదయాత్ర ప్రారంభిం చానని, గద్వాల తేరుమైదానం కొనసా గించానని చెప్పారు. ఆర్డీఎస్ తూములు మూసివేయాలని చెబితే అప్పటి కర్నూల్ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కేసీఆర్ ఒత్తిడికి తలొగ్గి రాజోళిబండ తూములు మూసేస్తే బాంబులు పెట్టి బద్దలు కొడతామని బెదిరించారని చెప్పారు. తాను అదేరోజు రాత్రి రాజోళి అనే గ్రామలో నిద్రచేసి మరుసటి రోజు ఉదయం కేసీ కెనాల్‌కు నీళ్లిచ్చే సుంకేసుల బరాజ్ వద్ద ఉండి సవాల్ విసరానని, ఆర్డీఎస్ తూములు బద్దలు కొడితే తాను నిలబడ్డ సుంకేసుల బరాజ్ 100బాంబులు పెట్టి పేల్చేస్తామని

మిగతా 4లో..

బస్సులో కొల్లాపూర్ వస్తుంటే బీజేపీ జెండాలు పట్టుకొని కొంతమంది యువకులు బస్సుకు అడ్డుకునే ప్రయత్నం చేశారని ఎందుకో చెప్పాలన్నారు. ఏం తప్పు చేశామో చెప్పాలన్నారు. నీళ్లివ్వడం ఇష్టం లేదా, తాము ఏమైనా చేయకూడని పని చేస్తున్నామా అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా బీజేపీ నాయకులకు సిగ్గు,శరం ఉంటే 10 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నారు కదా మన నీటి వాటా ఎందుకు తేల్చరో చెప్పాలన్నారు. కృష్ణ నదిలో నీటి వాటా తేల్చమని ప్రధాని అడిగితే ఎందుకు తేల్చడం లేదో చెప్పాలన్నారు. కృష్ణా ట్రిబ్యునల్‌కు నీళ్ల పంచమని ఒక లేఖ

## నీటి వాటా తేల్చని మోడీ..

రాస్తే సరిపోతుందని, పదేండ్లుగా మోడీ స్పందించడంలేదన్నారు. నీటి వాటా తేల్చాలని సుప్రీం కోర్టును తానను ఆశ్రయించానని కేంద్రం సంప్రదింపులకు పలిచి మళ్లీ ఎటూ తేల్చకుండా ఏడాదిగా నాన్చుతున్నారన్నారు. పాలమూరుకు ఇప్పటికే జరిగిన మోసంచాలన్నారు. బీఆర్ఎస్ నీళ్ల కోసం పోరాటం చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో ఇక్కడి నేతలు ప్రశ్నించాలన్నారు. పాలమూరుది 70ఏండ్ల గోస అని ఇక్కడి పరిస్థితులు తలుచుకుంటే తన కండ్లల్లో రక్తం వచ్చేదన్నారు. పాలమూరులో గంజి కేంద్రాలు వెలిశాయని, దత్తత తీసుకుంటే కూడా పాలమూరు గోస తీరలేదన్నారు.

## వలస జిల్లాకే వలసలు..

- రాష్ట్ర పర్యాటక, ఆబ్కారి శాఖమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ సమయంలో రాజోళిబండ వద్ద తాగడానికి నీళ్ల కూడా లేని పరిస్థితులు చూసి ఉద్యమ నేత కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకొన్నారని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ గుర్తు చేశారు. ప్రతినబూని, ప్రాణమున్నంత వరకు తెలంగాణ తెస్తా, ఈ జిల్లాను సస్యశ్యామలం చేస్తా అని ఆనాడు చెప్పారని, చెప్పిన మాట ప్రకారమే తెలంగాణ తెచ్చారని, 10ఏండ్లలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన కారణజన్ముడు కేసీఆర్ అని అన్నారు. మన నీళ్ల పక్క రాష్ట్రానికిపోతే హారతులు పట్టి సంబురాలు చేసుకున్నారని, వలసలు పోతుంటే కూడా పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టులకు కాలువలు తవ్వి డబ్బులు తిన్నరు తప్పా ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. కేసీఆర్ లేకుంటే కల్వకుర్తి నీళ్ల వచ్చేవా, పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మారేవా ఒక్కసారి ఆలోచిద్దామన్నారు. వలస పోయిన జిల్లాకే నేడు వలసలు వస్తున్నారని పేర్కొన్నారు. 2014లో నాట్లేస్తే రూ.20 ఇస్తుండే, నేడు కూలిలకు రూ.800నుంచి 1000 ఇస్తున్నారన్నారు. పాలమూరు జిల్లాకు చాలా చరిత్ర ఉన్నదన్నారు. కులం, మతం నేరుతో విడగొట్టిన్రని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే ఎక్కడా లేని మహాబాహుబలి మోటార్లు బిగించి నీళ్లస్తుంటే ప్రతిపక్ష నాయకులు కేసీఆర్‌ను మొక్కేది పోయి విమర్శించడం సరికాదన్నారు.మళ్లీ ద్రోహులొస్తరు ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కరువు కాటకాలు ఇక గతం..

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో కృష్ణా జలాలకు స్వాగతం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగి రెడ్డి నిరంజన్‌రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మాత్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** ఆరు జిల్లాల దుర్భిక్షాన్ని పాంద్రోలి లక్షలాది ఎకరాలకు సాగునీటిని, కోట్లాది ప్రజలకు తాగునీటిని అందించి, తెలంగాణ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించడం ఎంతో శుభపరిణామమని వ్యవసాయ శాఖ మాత్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల స్వప్నను స్వీకారం చేసిన అపరభగీరథుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. నార్లాపూర్ వద్ద మొదటి లిఫ్టును సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించి కొల్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అనేక ఆటంకాలను అధిగమించి, అవరోధాలను ఛేధించి, కృష్ణా జలాలను పొలాలకు తరలిస్తున్న ఈ రోజు తెలంగాణకు నిజమైన పండుగ రోజు అని ఆయన గుర్తు చేశారు. భారతదేశంలో త్రాగునీర, సాగునీటి కోసం దశాబ్దాలుగా పరితపిస్తున్న ప్రాంతాల్లో మరో మార్గం లేక ప్రజలు నిరంతరం ఇతర ప్రాంతాలకు వలసపోయేవారని, తెలంగాణ అవిర్భావంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అపూర్వ నాయకత్వాన భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ లాంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించారని, క్రమేణా ప్రజల వలసలు ఆగాయన్నారు. ఈ సమయంలో తెలంగాణ యవకనిపై ఒక అద్భుత ఘట్టానికి తెరతీయబడింది. తరతరాలుగా నిరాదరణకు గురై, తడారిన గొంతులతో నెర్రులిచ్చిన భూములతో కళావిహీనంగా మారిన ప్రాంతాల్లో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోసి జలసిరి అందించేందుకు తెలంగాణ ప్రజల భవిష్యత్తును సమూలంగా మార్చేందుకు రూ.50వేల కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మించారన్నారు. దేశ ప్రధాని హోదాలో జవహర్‌లాల్ నెహ్రూ అన్ని వనరులు చేతిలో 1948లో బాక్రానంగల్ ప్రాజెక్టును ప్రారంభిస్తే పూర్తికావడానికి 15ఏళ్ల సమయం పట్టిందని, అది కూడా కేవలం దాదాపు 9లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జూన్ 11 2015నాడు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి కృష్ణమ్మ నీళ్లతో మడిమడిని తడుపుతా, పాలమూరు రైతన్నల కాళ్లను కడుగుతా అని శపథం చేసి శరవేగంగా పూర్తి చేశారన్నారు. ప్రాజెక్టు కట్టనియ్యమని చంద్రబాబు చెబితే వెయ్యి చంద్రబాబులు అడొచ్చిన కట్టితీరుతామని, నేడు పూర్తి చేసి తెలంగాణ తలత్తెకునేలా, పాలమూరు ప్రజలు గర్వపడేలా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ప్రారంభించారన్నారు. పాలమూరు అద్భుతమైన జలకుండలా తలపిస్తుందన్నారు. కృష్ణమ్మ నీళ్లన తన స్వహాస్తాలతో అందించిన సీఎం కేసీఆర్‌కు రైతులు, ప్రజల పక్షాన మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలను భ్రమలో పెట్టేందుకు ఒక్క మోటారు ప్రారంభం

- ఓట్లు దండుకోవడానికే ప్రాజెక్టు ప్రారంభోత్సవం
- అధికారులను పార్టీ కార్యక్రమాలకు ఉపయోగించడం సిగ్గుచేటు
- డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మాట్లాడుతున్న డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట,సెప్టెంబర్16 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 9మోటార్లు నిర్మించాలని ఉన్నప్పటికి ఒక్క మోటార్‌ను ప్రారంభించి ప్రజలను భ్రమలో పెట్టి రానున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని చెప్పి ఓట్లను దండుకునేందుకు పూర్తి కానీ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సీఎం కేసీఆర్ హుటాహుటిన అంగు ఆర్భాటాలతో ప్రారంభించడం సిగ్గుచేటని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దుయ్యబట్టారు. శనివారం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తైనట్లు ప్రజలకు భ్రమలు కల్పిస్తూ ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.ప్రాజెక్టు వద్ద ఏలోపం లేని కాంగ్రెస్ పార్టీ నాయకులను అడ్డుకోవడమెందుకని, ప్రాజెక్టు వద్ద 144 సెక్షన్ అమలు చేయడమేమిటన్నారు. నార్లాపూర్ వద్ద ఒక్క మోటార్ పనులు మాత్రమే ప్రారంభమయ్యాయని, ప్రాజెక్టు మొత్తం పూర్తైనట్లుగా ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుర్తి ప్రాజెక్టు పూర్తి కానప్పుడు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో ఎలాగైనా తెలంగాణ ప్రజలను మరోసారి గద్దెనెక్కి ఎన్నికల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీటికి కొదవ లేకుండా చూస్తానన్న ఇచ్చిన హామీని నేరవేర్చానని మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ప్రజల వద్దకు రావడానికి ఒక్క మోటార్‌ను ప్రారంభించి దొంగనాటకాలాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా కల్వకుర్తి ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా నిలిచిపోయినప్పటికి కల్వకుర్తి ప్రాజెక్టు నిర్మాణానికి ఎందుకు చొరవ చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికి సీఎం రావడంతో ముందస్తుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస స్టేషన్‌లో ఉంచడం ప్రజాస్వామ్యామా అని ఆయన ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు జరిగినట్లు అయితే అరెస్ట్‌లు ఎందుకు చేస్తారని ఆయన ప్రశ్నించారు. దొంగ దొంగే అన్నట్లుగా చేసిన పనులు ఎక్కడ పడుతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు హరినారాయణగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ బుచ్చయ్య, ఎస్సీ సెల్‌అధ్యక్షులురాజగోపాల్, ఎంపీటీసీ శ్రీనివావాసులు, కోఆప్షన్ సభ్యులు రహీమ్, కాంగ్రెస్ నాయకులు విఘ్నేష్, డీసీసీ కార్యదర్శి రేణయ్య, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు..

## శాశ్వతంగా రైతుబంధు, బ్యాంకు రుణాలను కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు



**వీపనగండ్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు శాశ్వతంగా రైతుబంధును, బ్యాంకు రుణాలను కల్పించాలి అని ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సహక బహుమతులను కూడా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు డిమాండ్ చేశారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు,ఇతర ప్రాజెక్టులో పేదలు,వెనకబడిన తరగతులకు సంబంధించిన సన్న,చిన్న కారు రైతులు మధ్యతరగతి రైతులే దాదాపుగా 95 శాతం భూములు కోల్పోయారు.ఒక్క జాగిర్దారిది గాని ఒక బడా భూస్వామిగాని ఈప్రాజెక్టులో భూములు పోలేదు.ప్రాజెక్టులు శాశ్వతమైనవి కావున భూములు కోల్పోయిన రైతుల యొక్క త్యాగాల ఫలితంగానే ఈ ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి.శాశ్వత అభివృద్ధి కోసం త్యాగాలు చేసిన రైతులకు వారు కోరినంతగా నష్టపరిహారం ఇవ్వాలేదు.వారికి రైతు బంధు గాని ఇతర ప్రత్యేక ప్రోత్సహకాలుగాని ఇవ్వరు ఈ పాలకులు. .ఎలా ఉన్నారంటే ఇంటికి వచ్చిన బిచ్చగాడికి ధాన్యం దానం చేసినట్టుగా వారికి నష్ట పరిహారం ఇచ్చిచేతులు దులుపుకుంటున్నారు పాలకులు.అదే చట్టసభల ప్రజా ప్రతినిధులు అయితే వారు ప్రజాప్రతి నిధులుగా ఉన్నా, మాజీ ప్రజాప్రతి నిధులుగా ఉన్న వారి కుటుంబం జీవించి ఉన్నంత కొల ము జీతాలు పెన్షన్లు ఇస్తారు.అదే ఉన్నత ఉద్యోగులు అయితే అదేరకంగా ఇస్తారు.మరి ఈ రైతులు చేసిన శాశ్వత త్యాగాలకు గుర్తింపుగా ఎందు కు వారికి ప్రభుత్వ పథకాలకు తరువాత రైతుబంధు ఇతర సౌకర్యాలు కల్పించరు ఈపాలకులు అన్ని ప్రశ్నించారు.కాబట్టి ప్రాజెక్టుల్లో గాని రిజ ర్వాయర్లో గాని భూములు కోల్పోయిన రైతులకు శాశ్వతంగా రైతుబంధు ఇతర పథకాలు, ప్రత్యేకమైన ప్రోత్సాహక బహుమతులను తప్పనిసరిగా ఈ రైతంగానికి ఇవ్వావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం శనివారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.

## ఎందుకు చంపావమ్మా..

- కన్నప్రేమపై కనికరం లేదా..?
- నలుగురు పిల్లలను కాల్వలో తోసి.. ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన తల్లి



చనిపోయిన చిన్నారులు



రోధిస్తున్న తల్లి లలిత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** నవమాసాలు మోసి పేగు తెంచుకొని జన్మనిచ్చిన పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లే కనీకరం లేకుండా కర్కషంతో నలుగురు పసిగుడ్డల ప్రాణాన్ని బలిగొంది. బుడి బుడి అడుగులతో కళ్ల ముందు పారాడుతున్న పసిబిడ్డలను చూసి మురిసిపోవాల్సిన తల్లి... ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో కానీ ఏ కష్టం రాకుండా అల్లారు ముద్దుగా ఆలన పాలన చేస్తూ పెంచిన చేతులతోనే కాల్వలో పడేసి వారి చావును కళ్లతో చూసిన ఆ తల్లి ఆఘంతం ఏ తల్లికి రాకూడని కష్టం వచ్చిందో కానీ క్షణికావేశంలో నలుగురు పిల్లల చావుకు కారకులైంది. కుటుంబ కలహాలతో భర్తతో గొడవపడి తన నలుగురు పిల్లలను కేఎల్ఐ కాల్వలోతోసి తాను ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండలంలో చోటు చేసుకుంది. ముగ్గురు పిల్లలు మృతి చెందక, మరోకరు గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బిజనపల్లి మండలం ఎర్రగుంటతాండకుచెందినలలిత,బిజినపల్లి మండలంమంగ నూరు గ్రామానికి చెందిన శరబంద అనే వ్యక్తిని గత 8 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొంది. గత 10 రోజుల క్రితం భార్యభర్తలిద్దరు తరు చూ గొడవ పడుతూ వచ్చారు. శనివారం మధ్యాహ్నం భర్తపై ఫిర్యాదు చేసేందుకు బిజనపల్లి మండలంలోని పోలీస్‌స్టేషన్ చేరుకుంది.అనంతరం కొద్దిసేపటికే బయటకు వచ్చి సమీపంలోని కేఎల్ఐ కాల్వలోతన పిల్లలను తొసితాను ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్థానికులు గమనించి ఆమెను నిలువరించగా ముగ్గురు చిన్నారులుఅప్పటికే మృతిచెందారు.మహాలక్ష్మి(5),సాత్విక(4), మంజుల(3), మర్కండేయ (7నెలలు)గల్లంతయ్యారు. లలితను పోలీసులు అదుపు లోకి తీసుకొని గల్లంతైన బాబు కోసం వెతుకుతున్నారు.

### అక్రమ అరెస్టులతో సీఎం పర్యటించడం సిగ్గుచేటు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయించి పర్యటించడం సిగ్గుచేటుకరమని బీజేపీ జిల్లా నాయకులు మొగిలి దుర్గప్రసాద్ ఆరోపించారు. కల్వకుర్తి పట్టణంలో అర్ధరాత్రి బీజేపీ, ఏబీవీపీ, ప్రతిపక్ష పార్టీల నాయకులు, అంగన్‌వాడీ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేయించి పర్యటించడం సిగ్గుచేటు పేర్కొన్నారు. చిరు వ్యాపారులను, దుకాణదారులను పోలీసులు బంద్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ నాయకులు సురేందర్‌గౌడ్, పరుశరాం, వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో వంశీకృష్ణ

**అచ్చంపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన 50మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని సాధారంగా ఆహ్వానించి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గెలుపుకు నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు హరినారాయణగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ బుచ్చయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులురాజగోపాల్,ఎంపీటీసీ శ్రీనివావాసులు, కోఆప్షన్ సభ్యులు రహీమ్, కాంగ్రెస్ నాయకులు విఘ్నేష్, డీసీసీ కార్యదర్శి రేణయ్య, వెంకటరమణ,కిష్టయ్య, జగన్, రామాంజి, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

## సీఎం రాకతో నాయకుల అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఆయా పార్టీల నాయకులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ బహిరంగ సభ కొల్లాపూర్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా వివిధ పార్టీల నాయకులను, ప్రజా సంఘాల నాయకులను అర్ధరాత్రి అరెస్ట్ చేసి కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆశా వర్కర్లకు ఇంటి వద్దకు వెళ్లి తీసుకొని రావడం, అంగన్‌వాడీ ఉద్యోగులను తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె వద్ద ఎప్పటిలాగా ధర్నాలో కూర్చున్న వారిని పోలీసులు అక్కడి నుంచి తీసుకొని పోలీస్‌స్టేషన్ ముందు కూర్చోమని నిర్బంధం పెట్టారు. వివిధ పార్టీల నాయకులను, సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం పట్ల సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు తన బృందంతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలోతర్నికల్ గ్రామ సర్పంచ్ పాండుగౌడ్, నాయకులు దుర్గప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, మహమూద్, సురేందర్, శేఖర్, సైదులు, రఫికాసుల్తానా, జానకమ్మ, జయమ్మ, శోభ, అలివేలు, లత, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

## వెన్నల జల్లుల పుస్తకావిష్కరణ



వెన్నల జల్లుల పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఎం జూనియర్ కళాశాలలో ప్రభుత్వ సాహిత్య సమితి ఆధ్వర్యంలో కవి గుర్రాల లక్ష్మారెడ్డి రాసిన 3 పుస్తకాలు వెన్నెల కలవలు, వెన్నెల జల్లులు, వెన్నెల మణి పూసలు పుస్తకావిష్కరణ కవి పండితులు రుక్మాంగధరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్, సాంబయ్యగౌడ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కల్వకుర్తి మట్టిలో మహత్యం ఉంది. ఇక్కడి ప్రతి ఒక్కరిలో కవిత్వం ఊట మాదిరిగి వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య,జేపీసీ చైర్మన్ సదానందంగౌడ్, నారాయణగౌడ్, లక్ష్మారెడ్డి, సుధాకర్, దామోదర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ..

**భూత్పూర్ నుంచి అప్పంపల్లి వరకు బైక్‌ర్యాలీ నిర్వహించిన బీజేపీ**



**భూత్పూర్,సెప్టెంబర్16,ప్రభాతవార్త:** నిజాం నిరంకుశపాలన నుంచి తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం భూత్పూర్ నుంచి మూసాపేట,అడ్డాకుల,కొత్తకోట,సీసీకుంటల మీదుగా అప్పంపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం విమోచన దినాన్ని అధికారికంగా జరపడంలో తాత్సారం చేస్తోందని పేర్కొంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్‌రెడ్డి,రవీందర్‌రెడ్డిల నేతృత్వంలోనాయకులు,కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రవి,రూరల్ అధ్యక్షుడు రాంరెడ్డితో పాటునాయకులు హరినాథ్,సదానంద్,పట్నం శ్రీను,ఎంకంపల్లి మల్లేష్,పట్నం శ్రీశైలం తదితరులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## ఓజోన్‌ను పరిరక్షించుకుందాం!

**టిబిజలో మొక్కనాటిన అధ్యాపక, విద్యార్థి బృందం**



మొక్క నాటుతున్న ప్రొ॥ సదాశివయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ప్రపంచ ఓజోన్ దినోత్సవం 2023 సందర్భంగా స్థానిక బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ ఓజోన్ పొరక్షీణత, దానికి గల కారణాలు, మాంట్రియల్ ఒడంబడిక వంటి విషయాలపై విద్యార్థులకు పర్యావరణ ప్రేమికులకు అగాహన కల్పించడం కోసం వృక్షశాస్త్ర విభాగం వారు జాతీయస్థాయి క్విజ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ క్విజ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 530 మంది పాల్గొన్నారు. వీరికి ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్రవిభాగాధిపతి శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త డా.బి. సదాశివయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## దేవరకద్రలో కాంగ్రెస్ సమావేశం

**దేవరకద్ర,సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** దేవరకద్రలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం జరిగింది.ఆదివారం హైద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయభేరి సభను పురస్కరించుకొని ఈ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సభ విజయవంతానికి తమ వంతు కర్తవ్యంగా చేసే ఏర్పాట్లపై చర్చించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబిసి రాష్ట్ర వైస్ చైర్మెన్ రాజమూరి శ్రీనివాసులు,మండల ఓబిసి అధ్యక్షుడు గోపాల్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కృషి

**-ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు -అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఎమ్మెల్యే పరామర్శ**



విద్యార్థినులను పరామర్శిస్తున్న గువ్వల బాలరాజు

**అచ్చంపేట, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** మన్ననూర్ గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులు తిన్న భోజనం వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆసుపత్రిలో ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం కొంత వరకు మెరుగు పడిందని, అస్వస్థతకు గురైన విద్యార్థినులు కొలుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్లు అందుబాటులో ఉంటూ విద్యార్థినుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి క్షేమం కోసం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకొని అండగా నిలబెడితే బాగుంటుందని, ఆపదలో ఉన్న వారికి ఆటంకం కలిగించడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల, కళాశాల్లోని వసతి గృహాల్లో తన ఫోన్ నెంబరు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.మన్ననూర్ గిరిజన గురుకుల పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి జరుగుతున్న లోపాలను సరిచేసి మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలుచేపడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# మోసపూరిత వాగ్దానాలు నమ్మకండి



పార్టీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరిస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి

**ఉప్పునుంతల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసే టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్మ వద్దని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో రెండోరోజు సాగిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో ప్రజల వద్దకు వెళ్లి బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న మోసపూరిత వాగ్దానాలు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పెడచెవిన పెట్టి పేదలను నడ్డి విరుస్తుందని వివరించారు. రైతు లకు రుణమాఫీతో పాటు ఆడబిడ్డలకు 500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ పథకం కింద ఇంటికి ఐదు లక్షల సాయం, ఇంట్లో ఇద్దరు వృద్ధులకు పెన్షన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి విడత రెండు లక్షల ఉద్యోగాలను భర్తీచేసి తీరుతామని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డితో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మడ్డి తిరుప తయ్యగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ఎస్సీ సెల్ నాయకుడు బొల్లె లక్ష్మయ్య, కట్ట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు

**మక్తల్,సెప్టెంబరు16 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మక్తల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్‌వాడిల నిరవధిక సమ్మె ఆరవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ కార్యాలయం నుండి అంగన్‌వాడిలు అంబేద్కర్ చౌక్‌మీదుగా భారీ ర్యాలీ ప్రదర్శన చేస్తూ సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించారు. సిఐటియు జిల్లా కో కన్వీనర్ పుంజనూరు ఆంజనేయులు, కోకన్వీనర్ గోవిందరాజ్,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి,ఆర్ఎన్ రమేష్ గత ఆరు రోజులనుండి అంగన్‌వాడిలు రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది నిరవదిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ నియంతృత్వ పోకడలు అవలంబిస్తూ అంగన్‌వాడిలపై ఉక్కుపాదం మోపుతూ అంగన్‌వాడి సమస్యలు పరిష్కారం చేయకుండా అధికారులతో బలవంతంగా సెంటర్లను తెరిపించి అంగన్‌వాడిలపై అధికారులు వేధిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కిరణ్ భుట్టో, భగవంతు, నాయకులునారాయణ,విజయలక్ష్మి,ఎస్.మంజుల, శ్రీలత,యశోద, భాగ్యమ్మ, మన్నెమ్మ, శివకుమారి, ప్రసన్న, సునిత, మల్లమ్మ, గిరిజ, సుకన్య, రామేశ్వరి, బసవలింగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట నిరసన తెల్పుతున్న అంగన్‌వాడీలు

**భూత్పూర్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11నుంచి ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్ల సమ్మె శనివారానికి ఆరో రోజుకుచేరుకుంది.రోజుకో విధంగా వినూత్నరీతిలో నిరసలు తెల్పుతున్న అంగన్‌వాడీలు ఐదో రోజు కళ్లకు గంతలు కట్టుకుని సమ్మెలో పాల్గొన్నారు. కాగా శనివారం ఏకంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం,క్యాంప్ కార్యాలయం అన్నాసాగర్‌లో ఆయన ఇంటిని ముట్టడించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని సంబంధిత మంత్రి,సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తానని స్పష్టమైన హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తితో పాటు కార్మిక నాయకులు వేణుగోపాల్,నిక్సన్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌జిల్లాకార్యదర్శి పుష్పలత,భూత్పూర్‌మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌసియాబేగం,కవిత ఇతర సభ్యులు,కళావతి,విజయలక్ష్మి పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలపై ఐసిడిఎస్ అధికారుల వేధింపులు ఆపాలి

**అడ్డాకుల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఏఐటియుసి జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడిల సమ్మె శనివారానికి ఆరో రోజుకు చేరుకుందన్నారు. సమ్మెపైన ఐసిడిఎస్ అధికారులు తీవ్రమైన ఒత్తిడి వేధింపులకు సిబ్బందిపై పాల్పడుతున్నారని, శనివారం రోజు భూత్పూర్ మండల కేంద్రంలో ఒకటి రెండు మూడు సెంటర్ల తాళాలు పగలగొట్టి దొంగల్లాగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, తాళాలు పగులగొట్టిన సూపవైజర్ నాగేశ్వరి, పిడి ఆఫీస్ సిబ్బంది మంజులను భూత్పూర్ చౌరస్తాలో ఘెరావ్ చేశారు. ఐసిడిఎస్ సిబ్బంది వేధింపులకు పాల్పడి అంగన్‌వాడిల మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఒక ప్రకటలో తీవ్రంగా ఖండించారు. ప్రధానంగా అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని కనీస వేతనాలు అమలు పరచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వంపై పోరాడుతుంటే సిడిపిఓలు ప్రభుత్వం తీపి కబురు చెబుతుందని జీతాలు పెంచుతుందని అబద్ద ప్రచారం చేసి ప్రభుత్వ వైఖరి బట్టబయలైన తర్వాత నోరు తెవడం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘమైన టీఎస్జీఓ, బిఆర్‌టియు సమ్మె విచ్చిన్నానికి శత విధాల ప్రయత్నించి విఫలం చెందిందని, కార్మిక సంఘం నాయకురాలుగా చెప్పకునే సాధామిని నేడు జరుగుతున్న సమ్మెను విచ్చిన్నానికి పాల్పడడం, ప్రభుత్వ అండదండలతో టీచర్లను హెల్పర్లను బెదిరించడం తగదని వారు హెచ్చరించారు.ఒక అంగన్‌వాడి టీచర్‌గా జీతాల పెంపు కోసం అంగన్‌వాడి టీచర్‌గా జీతాల పెంపుకోసం అంగన్‌వాడి సిబ్బందికి అండగా ఉండకుండా సమ్మె విచ్చిన్నానికి పాల్పడుతూ, సమ్మె విద్రోహ శక్తిగామారిందని, ఇప్పటికైనా వైఖరి మార్చుకొని సమ్మెలోకి రావాలని తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సరోజ, పుష్పలత నేడు ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## సిఐటియు ఆధ్వర్యంలో వినతి



**మాగనూరు, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ఆశ వర్కర్లకు పారితోషికం కాదు కనీస వేతనం రూ. 18 వేలు, ఫిక్స్ వేతనం ఇవ్వాలని అదే విధంగా పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశాలకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ప్రమాదభీమా 5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్తింపజేయాలని అదేవిధంగా, ఆశా కార్యకర్తలకు దహన సంస్కారాలకు రూ. 50 వేలు ఇవ్వాలని, ఏఎన్ఎం, జిఎన్ఎం పోస్టులకు ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని పారితోషికం లేని పనులను ఆశలతో చేయించకూడదని సిఐటియు జిల్లా కో కన్వీనర్ పుంజనూరు ఆంజనేయులు మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన సమ్మె నోటీలసును అందజేశారు.కార్యక్రమంలో గౌరమ్మ, వెంకటమ్మ, పద్మ, లక్ష్మి, శాంతమ్మ,అంజమ్మ, శివమ్మ, రత్నమ్మ, నర్సమ్మ,కె.పద్మ పాల్గొన్నారు.

## చికిత్సపొందుతున్న వారికి ఎంపీపీ పరామర్శ

**దేవరకద్ర,సెప్టెంబరు16 ప్రభాతవార్త:** వివిధ ఆసుపత్రులలో ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందుతున్న వారిని శనివారం యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ పరామర్శించారు.దేవరకద్రకుచెందిన కుర్వ నరసింహ్మలు ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందున్నారు.ఈ విషయం తెలుసుకొన్న యంపీపీ ఆసపత్రికి వెళ్ళి ఆయనను పరామర్శించారు అలాగే ఆసుపత్రిలోచికిత్స పొందుతున్ననాగారం గ్రామానికి చెందిన రాములును కూడ యంపీపీ పరామర్శించారు.సంబంధిత వైద్యులతో మాట్లాడి అన్ని విషయాలు అడిగి తెలుసుకొన్నారు.మెరుగైన వైద్యం అందించాలని వారినియంపీపీ కోరారు.యంపీపీ వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## వాల్మీకి బోయల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం..



వాల్మీకి బోయ రవికుమార్

**మక్తల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** అయ్యా కెసిఆర్ మీ సభలో ఉన్నంత మాత్రాన మా వాల్మీకి బోయలను అర్ధరాత్రి పూట అక్రమ అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు బోయ రవికుమార్ తీవ్రంగా మండిపడ్డారు. మీకు చిత్తశుద్ధి ఉంటే గత 9 సంవత్సరాల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎస్టీ జాబితాలో చేర్చడానికి ఇతర కులాలను లింకు పెట్టి పంపడం సరైన పద్ధతి కాదని మీకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇతర కులాలను వేరుచేసి వాల్మీకి బోయల జాబాతాను మాత్రమే పంపించాలనివారన్నారు.అదేవిధంగా అక్రమంగా అరెస్టు చేసిన వాల్మీకి బోయలను విడిపించి బహిరంగ సభ నిర్వహించాలని బోయ రవికుమార్ తీవ్రంగా మండిపడ్డారు.ఇప్పటికైనా వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి చూపించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది.

### ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం : తహసీల్దార్

**వీపనగండ్ల,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో ఆదివారం సెప్టెంబర్ 17 తారీకున తాహసీల్దార్ కార్యాలయం దగ్గర ఉదయం 8 గంటలకు తెలంగాణ జాతీయ సమ్మైకత దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ వరలక్ష్మి తెలియజేశారు.అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో కూడా తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ సంబరాలు ఉంటాయని ఎంపీడీవో కథలప్ప తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అధికారులు,ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సాయుధ పోరాటన్ని వక్రీకరించే కుట్ర

**● సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాముడు**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు

**వనపర్తి క్రైం,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో మహోజ్వాల ఘట్టమని,పాలకులు వక్రీకరించే కుట్రలు చేస్తున్నారని సిపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు ఆరోపించారు.నాటి యోధుల స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడిలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు పిలుపునిచ్చారు.శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన తెలంగాణ పోరాట సంస్మరణ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి యోధుల స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.భూమి కోసం,భుక్తి కోసం,బానిసత్వం నుంచి తెలంగాణ ప్రజల విముక్తి కోసం పోరాడారని కీర్తించారు.నాలుగు వేల మంది అమరులయ్యారని, 3000 గ్రామాలలో ప్రజా కంటకులైన దొరలు భూస్వాములను తరిమికొట్టి పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘన చరిత్ర సిపిఐ సొంతమని ఉద్ఘాటించారు.కమ్యూనిస్టుల పోరాటన్ని త్యాగాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే పాలక పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.సెప్టెంబర్ 17, 1948 రోజును విమోచన,జాతీయసమైక్యత దినం పేరుతో జరపాలని నాటకమాడుతున్నారని ఆరోపించారు.సర్దార్ వల్లభాయ్ సైనిక చర్యతో కమ్యూనిస్టులు మృతి చెందారని ఆవేద వ్యక్తం చేశారు.నాటి పోరాటయోధుల స్ఫూర్తిని కమ్యూనిస్టుల త్యాగాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు.పేదరికం దరిద్రం కష్టజీవులు సమస్యలు ఉన్నంతవరకు కమ్యూనిస్టు పార్టీ ప్రజల గుండెల్లో ఉంటుందన్నారు.ప్రజల్లో చైతన్యాన్ని నింపి సమస్యల పరిష్కారానికి సన్నంద్ధం చేయడమే నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జె.చంద్రయ్య, వంశి,సీఎన్ శెట్టి,కడారికృష్ణయ్య,మల్లేష్,రవీందర్,ఎర్ర కుర్మయ్య,చిలుక కృష్ణయ్య,తిరుపతయ్య పాల్గొన్నారు.

## పరం పోగు,ఇనాం భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

**● తెలంగాణ దండోరా వ్యవస్థాపకులు మీసాల రాము మాదిగ**



మీసాల రాము మాదిగను గృహనిర్బంధం చేసిన పోలీస్ సిబ్బంది

**వీపనగండ్ల,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో తెలంగాణ వ్యవస్థాపకులు మీసాల రాము మాదిగను పోలీసులు అరెస్టు చేశారు. రాము మాదిగ మాట్లాడుతూ..అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని, ఉద్యమాన్ని ఆపాలని చూస్తే,వెయ్యిరెట్ల ఉత్సాహంతో ఉద్యమాలు చేస్తామని, తెలంగాణ దండోరా,తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న మాదిగ తెలిపారు.శనివారం నాడు కొల్లాపూర్‌కు కేసీఆర్ వస్తున్నందుకు, ముందస్తు ఆరెస్టుతో పోలీసులు మీసాల రామన్న మాదిగను అరెస్టు చేసి, వీపనగండ్ల పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్లారు.ఈ సందర్భంగా మీసాల రామన్న మాదిగ మాట్లాడుతూ, గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెనిద్ర కార్యక్రమాలు చేశామని, ఈ గ్రామానికి వెళ్ళిన అనేక సమస్యలతో ప్రజలు సతమవుతున్నారని, పరంపోగు, ఈనం భూములు,తదితర దళిత సమస్యల పై,ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాల యానికి పోస్ట్ కార్డు ఉద్యమం కూడా చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.నేడు కొల్లాపూర్ లో జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కొల్లా పూర్ నియోజకవర్గం ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని, మేము పోస్ట్ కార్డు ఉద్యమంలో ఏ డిమాండ్లైతే మీ దృష్టికి తీసుకువచ్చామో ఆ డిమాండ్లను నెరవేర్చే విధంగా మీ యొక్క ప్రసంగం ఉండాలని ఆయన కేసీఆర్ ను కోరారు.

## అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతును ఆపలేరు

**● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య, ఎత్తం కృష్ణయ్య**



కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీస్‌లు

**వీపనగండ్ల,సెప్టెంబర్16,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలను ఎస్సై రవి ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అరెస్టు చేయడం అన్యాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య,మాజీ రైతుబంధు సమితి సమన్వయ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య,కిసాన్ సెల్ అధ్యక్షుడువెంకటరెడ్డి అన్నారు.వారు మాట్లాడుతూ..శనివారం కొల్లాపూర్ లోని నార్లాపూర్ దగ్గర పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ అసంపూర్తిగా ఉన్న ఎన్నికల కోసం ముందస్తుగా ప్రారంభించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రావడం సమంజనం కాదని వారు అన్నారు.2005 సంవత్సరంలో 35వేల 200 కోట్ల వ్యయంతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రెండు లక్షల ముప్పై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని,రెండున్నర సంవత్సరాలలో పూర్తి చేస్తామని చెప్పినా ముఖ్యమంత్రి ఇప్పటివరకు 31 మోటార్ల పనిలో ఒక మోటార్ పని మాత్రమే పూర్తయిదని ఇంకా 30 మోటార్ల పని పూర్తి కాలేదని,అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టును ప్రారంభించడం హస్యాస్పదమని,అన్యాయం పైన ప్రశ్నిస్తున్న మా కాంగ్రెస్ కార్యకర్తలను సీఎం కేసీఆర్ సభను అడ్డుకుంటారని నెపంతో అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని వారన్నారు.అరెస్టు అయిన నాయకులలో బొల్లారం సుదర్శన్ రెడ్డి,వైఎస్ వెంకటయ్య,వార్డు మెంబర్ ఎల్లయ్య,ముంతటి గోపి ,కోళ్ల,వెంకట్ రెడ్డి,మాందాపురం నరసింహ,ఎత్తం వెంకటేష్, సర్వారెడ్డి, ముత్యాలు గడ్డల రాముడు,ఆంజనేయులు,గడ్డల ఆంజనేయులు, బాలపీరు, తప్పేట స్వాములు,ఎల్లయ్య,డ్రైవర్ మద్దిలేటి,డ్రైవర్ రాముడు,తదితర కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ



**దేవరకద్ర,సెప్టెంబరు16ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్య కాపమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకర శర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.అలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.








# ఊరంతా సందడే..!

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జనం పరుగు..
- కలశాలతో నార్లాపూర్ సీఎం కేసీఆర్ సభకు తరలిన పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజలు
- ఎటు చూసిన కిక్కిరిసిన బస్సులు
- జనసంద్రమైన కొల్లాపూర్..
- భారీగా తరలివచ్చిన గులాబి శ్రేణులు

**భూత్పూర్, సెప్టెంబర్16, ప్రభాతవార్త:** ఎంతో కాలంగా ఎదురు చూసిన ఘడియ రానే వచ్చింది. గడిచిన ఏడు దశాబ్దాల కాలంగా వేచిచూసిన పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజలు, రైతుల కల సాకారమైంది. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును చేపడితే, దక్షిణ తెలంగాణలోని పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో కరువును పారద్రోలేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి కురుమూర్తిరాయ ప్రాజెక్టుకు జలాభిషేకం చేసేందుకు నార్లాపూర్ వద్ద తొలి లిఫ్ట్ పంప్ వెట్‌రన్‌ను ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్‌కు వస్తునన సందర్భంగా శనివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలతో పాటు రంగారెడ్డి జిల్లాల నుంచి రైతులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఎటు చూసినా రోడ్లపై జనసందోహమే కన్పించింది. దాదాపుగా అన్ని డిపోల బస్సులు సీఎం సభకు తరలివెళ్లాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ పాఠశాలల బస్సులు కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఎం సభకు జనాలతో తరలించారు. ఈ జిల్లాల్లో కొన్ని బస్ డిపోలు శనివారం మూతపడ్డాయి. స్కూల్ బస్సులు సీఎం సభకు జనాలతో తరలి వెళ్తున్నందున పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. సీఎం పర్యటన, వినాయక చవితి సందర్భంగా పాఠశాలలకు శని, ఆది, సోమవారాలు వరుసగా మూడ్రోజులు సెలవులువచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు, నాయకుల్ని ఎమ్మెల్యే ఆల, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖం రెడ్డి, నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మూస బాలస్వామి, మూససాయిలు దగ్గరుండి సమన్వయ పరిచారు.

**కొల్లాపూర్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభో త్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హజరు కావడంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి గులాభి శ్రేణులు తమ నాయ కుడి సమావేశానికి, ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి భారీగా తరలివచ్చారు. గులాభి శ్రేణుల రాకతో కొల్లాపూర్ పట్టణం గులాభిమయం కావడంతో జనసంద్రంతో కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలని జనాలతో కొల్లా పూర్ కోలహాలంగా కనిపించింది. కొల్లాపూర్‌లో నిర్వ హించిన భారీ బహిరంగ సభను విజయవంతం చేసేం దుకు మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు, ప్రత్యేక చొరవ తీసుకొని కార్యకర్తలను, అభిమానులను తరలిం చేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా సస్యశామల్యంగా మారుతుందనే సముచిత ఆలోచనతో బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చెప్పే మాటలను విని ఆనందించడానికి అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు.

**గద్వాలప్రతినిధి, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు సీఎం కెసిఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ ప్రాజెక్టును సీఎం కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్న కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీ ఎత్తున దాదాపు 150 బస్సులు, 230కి పైగా కార్లలో కొల్లాపూర్ మండలం నార్లాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**పానగల్, సెప్టెంబర్16, ప్రభాతవార్త:** కొల్లాపూర్ సమీపంలో ని నార్లాపూర్ వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతుల పథకాలున్ని ప్రారంభించేందుకు వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు మండల పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రం నుండి ప్రజలు అభిమానులుకార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు. ఇట్టి సభకు బయలు దేరుతున్న వాహనాలను మండల ఎంపీపీ శ్రీధర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు రాము యాదవ్ లు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నచ్చి స్వచ్ఛందంగా ప్రజలు తరలిరావడం హర్షించదగ్గ విషయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డితో పాటు గ్రామ టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**కోయిల్‌కొండ, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** కోయిల్‌కొండ మండలం నుంచి టిఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ స్థాయిలో మండల కేంద్రమైన కోయిల్‌కొండ వివేకానంద చౌరస్తాకు చేరుకుని అక్కడి నుండి నారాయణపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త, ఎమ్మెల్యే సోదరుడు ఎస్. రవిందర్‌రెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. భారీగా తరలివచ్చి పార్టీ నేతలు, కార్యకర్తలు ఆర్టీసి బస్సులలో సీఎం సభాస్థలికి తరలివెళ్లారు. కార్యక్రమంలో కోయిల్‌కొండ గ్రామసర్పంచ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి.కృష్ణ, జిల్లా రైతు కమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్‌సర్పంచ్ స్వప్నరవి, మండల రైతు సమన్వయకర్త మల్లయ్యయాదవ్, వివిధ గ్రామాల నుంచి బయలుదేరిన కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

**ఉప్పునుంతల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని నార్లాపూర్‌లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రావడంతో శనివారం డిసిసిబి డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవిందర్ రావు, అచ్చంపే పాలశీతలీకరణ చైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బాలునాయక్ నేతృత్వంలో ఐకెపి ఎపిఎం సైదులు, మండల పంచాయతీ అధికారి నారాయణ, మండలంలోని పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సీఎం కెసిఆర్ నిర్వహించే బహిరంగ సభకు మండలం నుంచి భారీగా టిఆర్ఎస్ శ్రేణులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పార్టీ అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామాలలో గ్రామ పంచాయతీ అధికారులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలను పోగుచేసేసరికి తలలు పట్టుకుంటున్నారు. అధికారికంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తీసుకొచ్చే విధంగా పని చేయాలని ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకే తాము పని చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



గులాభిమయమైన కొల్లాపూర్

**వీపనగండ్ల, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రం లోని వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో ముఖ్యమంత్రి కెసిఆర్ మహాసభకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రైతుబంధు సమితి సమన్వయ అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, సీనియర్ నాయకులు కర్ణాకర్ రెడ్డి, వివిధ గ్రామాల బిఆర్ఎస్ సర్పంచులు మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోని అతి పెద్ద ప్రాజెక్టు అయినా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల వెటరన్ ప్రాజెక్టు పైలాన్‌నార్లాపూర్ దగ్గర ప్రారంభిస్తున్నారని. ఈ ప్రాజెక్టు వలన ఆరు జిల్లాలోని 12 లక్షల 30000 ఎకరాలకు సాగునీరు, 1226 గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్నారని, తెలంగాణ రాకముందు కరువు జిల్లాగా పేరు పొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అపర భగీరథుని లాగా ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలం చేస్తున్నారని వారు అన్నారు. వీపనగండ్ల మండల కేంద్రం నుండి 1500 మంది పైచిలుకు కార్యకర్తలు కొల్లాపూర్ సభకు బయలుదేరారని అన్నారు. అదేవిధంగా గోపల్ దిన్నె గ్రామంలో వెయ్యి మంది, ఎద్దు సురేందర్ ఆధ్వర్యంలో పుల్గర్ చర్ల వెయ్యి మంది, సర్పంచ్ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కల్వరాల గ్రామం నుండి 1000 మంది, వల్లభాపురం నుండి 500 మంది, తూముకుంట నుండి 500 మంది, బొల్లారంనుండి 700మంది, గోవర్ధ నగరి నుండి1000 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు మహాసభకు వచ్చారని బిఆర్ఎస్ నాయకులు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

◆కాంగ్రెస్ పార్టీలో చేరిన శెట్టి ఆత్మకూర్ బిజెపి నాయకులు కృష్ణయ్యగౌడ్
◆పార్టీలోకి ఆహ్వానించిన తాలూకా కో ఆర్డినేటర్, జడ్పీ చైర్‌పర్సన్ సరిత



జడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం జడ్పీ ఛైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల పరిధిలోని మండల పరిధిలోని శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బిజెపి నాయకులు కృష్ణయ్యగౌడ్ ఆధ్వర్యంలో మహిళలు, యువత 200ల మంది కాంగ్రెస్ పార్టీలో జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన వారు మాట్లాడుతూ గత పాలకుల పుణ్యామా శెట్టి ఆత్మకూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీని గద్వాలలో గెలిపించుకుని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకుని రావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వరలక్ష్మి, వెంకటస్వామిగౌడ్, గోనుపాడు శ్రీనివాస్‌గౌడ్ శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, ఎల్లప్ప, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, గౌస్, భాషా, రాఘవేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పరుగు పందెంలో విద్యార్థినికి గోల్డ్ మెడల్



విద్యార్థినికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్‌లో మక్తల్ మండలం, చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు సౌమక్యకు రూ. 1500ల మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, నిర్లకు 800 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించారు. ప్రధానోపాధ్యాయులు కుమార్ విభీషణ్ మాట్లాడుతూ విద్యార్థులు మెడల్స్ సాధించడంలో గ్రామ యువకుడు కోచ్ యు రాజు పాత్ర చాలా కీలకమని గుర్తు చేశారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు విద్యార్థినిలను, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని కోచ్ రాజును ప్రశంసించి అభినందించారు.

## ఆర్థిక సహాయం అందజేసిన జడ్పీటిసి

**అడ్డాకుల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కందూరు గ్రామానికి చెందిన తెలుగు ఆకుల మైబు గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న అడ్డాకుల మండల జడ్పీటిసి నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు అంతిమ సంస్కరణల నిమిత్తం 5 వేల ఆర్థిక సాయం పంపగా స్థానిక నాయకుల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ నాయకులు మృతుని స్వగృహానికి వెళ్లి పార్థీవ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు టి. శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, కందూరు దేవస్థానం ఛైర్మన్ రమేష్‌గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వార్డు మెంబర్ సభ్యులు లక్ష్మయ్య, చల్మారెడ్డి, రమేష్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న జడ్పీటిసి నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి

## ఇంజనీర్‌లు నిస్వార్థంగా దేశాభివృద్ధికి పాటుపడాలి

-రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
-స్విట్స్‌లో ఘనంగా 56 ఇంజనీర్స్‌డే వేడుకలు

**దేవరకద్ర, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ఇంజనీర్‌లు నిస్వార్థంగా దేశాభివృద్ధికి పాటుపడాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ కే. వెంకటేశ్వర్లు అన్నారు. దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి స్విట్స్ ఇ ంజనీరింగ్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 162వ జయంతిని పురస్కరించుకొని 56వ ఇంజనీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలువేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. దానిని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి చదువుకొన్న కళాశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాలన్నారు. లక్ష్యంతో ముందుకు వెళ్తే తప్పక విజయం సాధిస్తారన్నారు. రిటైడ్ ఛీఫ్ ఇంజనీర్ కే. తిరుపతిరెడ్డి ప్రసంగిస్తూ ఇంజనీర్స్ యొక్క పాత్ర సమాజంలో ఎంతో ముఖ్యమన్నారు. ఇంజనీర్స్ ఏ పని చేసిన అది చాలా నాణ్యవంతంగా ఉంటుందన్నారు. అలాగే అది ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలాఉండాలన్నారు. విశ్వేశ్వరయ్య జీవితం విద్యార్థులకు ఒక మార్గదర్శకమన్నారు.



కళాశాలలో జరిగిన సమావేశానికి హాజరైన అహుతులు

**విద్యార్థులకు బహుమతులు అందజేత:** ఇంజనీర్స్‌డే సందర్భంగా స్విట్స్ ఇ ంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే వచ్చిన ఆహుతులకు కళాశాల తరుపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జయంతి ఎడ్యూకేషన్ సొసైటీ అధ్యక్షుడు కల్వ కన్నయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి బాలేశ్వర్, ట్రెజరర్ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి భాస్కర్, ప్రిన్స్‌పాల్ పి. సుధాకర్, కన్వీనర్ నాగరాజు, వైస్ ప్రిన్స్‌పాల్ బి. తేజవర్ధన్, కళాశాల పూర్వ విధ్యార్థిహమీద్ అబ్దుల్ హమీద్‌ల తోపాటు వివిధవిభాగాలఅధ్యాపకులు, విద్యార్థులు

## విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

●సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.రవి కుమార్

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.రవి కుమార్ అన్నారు. తెలంగాణ లోక్ అదాలత్ సంస్థ నేతృత్వంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోకి చట్టాల ఆవశ్యకతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్రమ శిక్షణ, పట్టుదల, ఆత్మా విశ్వాసంతో విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పలు వర్గాల ప్రజలకు లోక్ అదాలత్ సంస్థ ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై పలుఅంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య ఉత్తరయ్య, నరేందర్ బాబు, ప్రవీణ్, రియాజ్ అహమ్మద్, కళాశాల బృందం కవిత, భావన, లోక్ అదాలత్ సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.రవి.కుమార్

## గోపన్‌పల్లిలో ఘనంగా ఆంజనేయస్వామి బిందెసేవ

-స్వామి వారికి ఘనంగా పంచామృతాభిషేకం

**దేవరకద్ర సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో శనివారం శ్రీ ఆంజనేయస్వామి బిందెసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గోపన్‌పల్లిలో ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు సాంప్రదాయరీతిలో భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి బిందెసేవను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని వ్యవసాయబావి నుండి నీటిని తీసుకవచ్చి పూజారి మఠం సురేశ్‌స్వామి, తమ్మలి రవికుమార్ అధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే అర్చనలు నిర్వహించారు. అలాగే గ్రామదేవతలకు కూడ పలు పూజలు నిర్వహించారు. విశేష దినోత్సవం సందర్భంగా ఆంజనేయస్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. షందూర, తమలపాకుల పూజలు కూడ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిమూల విగ్రహాన్ని రకరకాల పూలు, వివిధ ఆభరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ పూజా కార్యక్రమంలో పుట్టపల్లితో పాటు దేవరకద్ర, కౌకుంట్ల, డోకూర్, కోటకదిర గ్రామాలకు చెందిన భజనపరులుపాల్గొని అఖండభజన చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి మఠం సురేశ్‌స్వామి, తమ్మలి రవికుమార్‌తో పాటు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.




దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో బిందెసేవ నిర్వహిస్తున్న భక్తులు

## రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా శాతర్ల భాస్కర్ నాయుడు

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా రేవెల్లి మండలానికి చెందిన శాతర్ల భాస్కర్ నాయుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతునే ఉన్నామని, ఆర్టీసీ కార్మికులు, వీఆర్ఏ పలు సమస్యల పైన పోరాటాలు చేశామని తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడి పని చేసే వాళ్లను అధినాయకత్వం గుర్తిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించడంతో మరింత బాధ్యతలు పేరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాల పైన నిరంతరం పోరాటలు చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన టిపిసిసి రేవంత్ రెడ్డి, టీపీవైసీ అధ్యక్షులు శివ సేనారెడ్డి, ఐవైసీ బి.వి.శ్రీనివాస్, ఐవైసీ అధికార ప్రతినిధి సురయ్యా అంజుమ్, టిపివైసి మాజిద్, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి భాస్కర్ నాయుడు

## కాంగ్రెస్ విజయభేరిని విజయవంతం చేయండి

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి



**దేవరకద్ర, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తుక్కుగుడలో ఆదివారం జరిగే రెండు రోజుల సిడబ్లుసి కాంగ్రెస్ విజయభేరి సమావేశానికి దేవరకద్ర నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని దేవరకద్రకు చెందిన టీపీసీసీ కార్యదర్శి కొండ ప్రశాంతరెడ్డి కోరారు. దేవరకద్రలో ఆయన శనివారం మాట్లాడారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతాయని ఆయన తెలిపారు. అలాగే ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్‌సుఖు, రాజస్థాన్ యుఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఛత్తీష్‌ఘడ్ ముఖ్యమంత్రి భూపేశ్‌భగేల్, అలాగే గిరీష్ చొడంకర్, దీపక్‌బబారియా, డికె. శివకుమార్, రన్‌దీప్‌సర్వేవాల, చంద్రకాంత్‌హొండోరె, దీపేందర్‌సింగ్ హుడా, గైఖంగం గాంగ్మే, మోహన్‌ప్రకాశ్, చవన్‌అశోక్‌రావ్, అజయ్‌మాకెన్, శశితరూర్ తదితర ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరవుతారని కొండ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## విశ్వబ్రాహ్మణ సెల్ జిల్లా కన్వీనర్‌గా నరేష్‌చారి నియామకం



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** విశ్వబ్రాహ్మణ సెల్ జిల్లా కన్వీనర్‌గా జిల్లాకు చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు వి. నరేష్‌చారిని నియమిస్తూ నియామక పత్రాన్ని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి అందజేశారు. ఈ సందర్భంగా నరేష్‌చారి మాట్లాడుతూ నాపైన పార్టీ నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను వమ్ము చేయకుండా విశ్వకర్మలతో పాటు, చేతి వృత్తులపై ఆధారపడిన వారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను చేరే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

## పుట్టపల్లిలో ఘనంగా అఖండభజన

**దేవరకద్ర, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అఖండభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుట్టపల్లితో పాటు కౌకుంట్ల, బస్వాయపల్లి, కోటకదిర, దేవరకద్ర గ్రామాలకు చెందిన భజనపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజారి మఠం సురేశ్ స్వామి అధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. స్వామి వారి చిత్రపటాన్ని శోభాయమానంగా అలంకరించారు.

## జమ్మిచెడు కార్తీక్‌ను అరెస్టు చేయడం దుర్మార్గం

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కొల్లాపూర్ పర్యటనకు వస్తున్న సందర్భంగా బహుజన సేన గద్వాల జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య ఉద్యమ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సమంజసమా ? అరెస్టు చేసిన ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జమ్మిచెడ్ కార్తీక్‌ను అలాగే బహుజనసేన జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య తక్షణమే విడుదల చేయాలని కోరారు.

## విద్యావంతుల సమావేశం విజయవంతం చేయాలి

**అడ్డాకుల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** నేడు ఆదివారం ఉదయం 10 గం.లకు విద్యాజ్యోతి పాఠశాల భవనం దేవరకద్ర పట్టణంలో దేవరకద్ర నియోజకవర్గ స్థాయి యాదవ విద్యావంతులు వేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు అడ్డాకుల మండల యాదవ సంఘం అధ్యక్షులు భీమన్నయాదవ్ తెలిపారు. సమావేశంలో యాదవ విద్యావంతుల వేదిక నియోజకవర్గ కమిటి ఎన్నిక, విస్తరణ, భవిష్యత్తు కార్యాచరణ ఎజెండాగా ఉండనున్నట్లు తెలిపారు. సమావేశానికి యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలుయాదవ్, జిల్లా అధ్యక్షులుఅంజన్నయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జుర్రు నారాయణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్ యాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలోని యాదవ విద్యావంతులందరు తప్పకుండా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని భీమన్న యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** మండలంలోని సూర్యతండాకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 30 మంది బిఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, తాలూకానాయకులు, సీనియర్ న్యాయవాది గంగాపురం రాజేందర్, పెనిమెళ్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఇంఛార్జి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు

**మూసాపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** కొల్లాపూర్‌లో జరిగే ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు జడ్పీటిసి ఇంద్రయ్య సాగర్ ఆధ్వర్యంలో మూసపేట మండల కేంద్రంతో పాటు నిజలాపూర్, జానంపేట, తుంకిలిపూర్, అచ్చాయిపల్లి, చక్రాపూర్, సంకలమద్ది, పోల్కంపల్లి, తిమ్మాపూర్, కొమ్మిరెడ్డిపల్లి, వేముల, దాసర్‌పల్లి, నందిపేట్, చక్రాపూర్, స్ఫూర్తితండా తదితర గ్రామాల నుండి కొల్లాపూర్ సిఎం కెసిఆర్ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, ఎంపిపి గుపని కళావతి కొండయ్య, కో ఆప్షన్ ఎండి జమీర్, వైస్ ఎంపిపి రవిందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మినరసింహయాదవ్, వివిధగ్రామాల సర్పంచ్ ఎంపిటిసిలు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

## ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

**దేవరకద్ర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలం చిన్న రాజమూరు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కింపును శనివారం నిర్వహించారు. గత ఏడాది మార్చి 2023 నుండి ఇప్పటివరకు భక్తులు హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ హుండీ లెక్కింపులో రూ. 5 లక్షల 39 వేల 509 రూపాయల ఆదాయం వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక వంశీయులు, ప్రధాన అర్చకులు, ఇన్స్‌పెక్టర్, మేనేజర్ గ్రామ పెద్దలు, సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్పంపల్లి అమరవీరుల సాక్షిగా ఉద్యమిద్దాం!

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** తెలంగాణ బానిస సంకెళ్లు తెంపేందుకు రజాకర్లతో పోరాడి అమరులైన అప్పంపల్లి వీరుల సాక్షిగా కెసిఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమానికి సిద్దం కావాలని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటి సభ్యులు పద్మజారెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బిజెపి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శనివారం భూత్పూర్ నుంచి అప్పంపల్లి అమరవీరుల స్తూపంవరకు బిజెపి నేతలు బైక్ర్యాలీ నిర్వహించారు. అనంతరం అప్పంపల్లి అమరవీరులకు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించి జాతీయ పతాకాన్ని ప్రభుత్వమే ఆవిష్కరించాలని బిజెపి సుదీర్ఘ పోరాటం చేయడం వల్లే కెసిఆర్ ప్రభుత్వం తలొగ్గి సెప్టెంబరు 17ను నిర్వహిస్తుందన్నారు. ఈ విజయం బిజెపిదే అని అన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లైన లక్ష్మినారాయణరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, మాధవరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నరసింహులు బాలమణెమ్మ, దేవరకద్ర బాలన్న, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు నంబిరాజు, మాధవరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కురువ రమేష్, జిల్లా నాయకులు గాలిరెడ్డి, నారాయణరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు దశరథ్, రవిందర్, అంజన్‌కుమార్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కోటేష్‌రెడ్డి పాల్గొన్నారు.



అప్పంపల్లి అమరవీరులకు నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు



దర్గాను దర్శించుకుంటున్న పట్నం రవితేజ

## దార్గను దర్శించుచుకున్న పట్నం రవితేజ

**సదాశివపేట, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండలంలోని చందాపూర్ గ్రామంలోని దర్గాను బిఆర్ఎస్ యువ నాయకులు పట్నం రవి తేజ శనివారం మైనార్టీ నాయకులు ఆహ్వానం మేరకు దర్శించుకున్నారు. దర్గాకు దట్టిని కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా అభ్యున్నతికి తన వంతు సహకారం అందచేస్తానని పట్నం రవితేజ హామి చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామ యువతతో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, మైనార్టీ నాయకులు, పిఎంకె యువసేన నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండలంలోని ఎస్గీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన (100 మంది వరకు) కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పార్టీ ఖండువాలు కప్పి కారెక్కించుకున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై బిఆర్ఎస్‌లో చేరినట్లు పంచాయితీ వార్డు సభ్యులు సురేఖ బస్వరాజ్, మాజీ వార్డు సభ్యులు ఈశ్వర్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక రాజు పాటిల్, మాజీ ఉప సర్పంచ్ మొగులప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వివరాలు తెలపాలి : ఎస్ఐ

**పుల్కల్, సెప్టెంబరు 16, ప్రభాతవవార్త:** గణేశ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నుంచి ప్రారంభం అయ్యే తొలిపూజలు అందుకునే పార్వతీ దేవి తనయుడు విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠించుకునేందుకు ఏర్పాటు చేసే మండపాల వివరాలను నిర్వాహకులు విధిగా పోలీసు ఠాణాలో అందచేయాలని ఎస్ఐ పి విజయ్‌కుమార్ సూచించారు. శనివారం ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాల వివరాలను మీ-సేవా కేంద్రాల్లో పోలీసు పోర్టల్‌లో నమోదు చేసి జిరాక్సు పత్రాలను పోలీసు ఠాణాలో అందచేయాలన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన మండపాల వివరాల సమాచారం ఉంటే తాము తగు భద్రత కల్పించే అవకాశాలు ఉంటాయన్నారు. మండపాల నిర్వాహకులు విధిగా సమచారాన్ని అందచేయాలని ఎస్ఐ పి విజయ్‌కుమార్ సూచించారు.

## గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**సదాశివపేట, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** గౌడ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన పెద్ద నరసింహగౌడ్‌ను శనివారం ప్రింట్ మీడియా అసోసియేషన్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి కృషి చేసిన వారికి గుర్తింపు దక్కడం తథ్యమన్నారు. గౌడ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కమిటికి సూచించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నరసింహగౌడ్, రాఘుగౌడ్, కాశ్యగౌడ్, అశోక్ గౌడ్, నాయకులు నర్సారెడ్డి, కిరణ్‌రెడ్డి, కౌన్సిలర్ శివకుమార్, సదాశివపేట ప్రింట మీడియా ఆసోసియేసన్ అధ్యక్షులు వెంకటేశ్ గౌడ్, ఉపాధ్యక్షులు నాయికోటి విశ్వనాథ్, బషీర్, ప్రధాన కార్యదర్శి బత్తిని శేఖర్, సంయుక్త కార్యదర్శి నెల్లి శ్రీనివాస్, కోశాధికారి గణేష్, కార్యవర్గ సభ్యులు శ్రీధర్ జైన్, ఫోటో మల్లేశం, ఫోటో రాము, మన్సూర ఆహ్మద్, ఉమర ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

**మనూర్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** స్వర్గీయ తండ్రి కుర్ణం తుకారాం జ్ఞాపకార్థం మండలంలోని దవ్వూర్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు తనయులు నోటు పుస్తకాలను పంపిణి చేశారు. కుర్ణం తుకారాం మూడవ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలను విద్యార్థులకు అందచేశారు. విద్యతోనే సంస్కారం అందే అవకాశాలు ఉంటాయని, అందుకు తమ తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు తమ వంతు సహకారం అందించేందుకు నోటు పుస్తకాలను అందచేసినట్లు తుకారాం కుమారులు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్, ఉపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, సంగప్ప, యూత్ సభ్యులు గైని చిరంజీవి, పొట్టి రవి, అంజయ్య, శ్రీరామ్, శ్రీనివాస్, నర్సింలు, దత్తు, అర్జున్, చందు, రాములు, రాహుల్, రమేష్, పండరి, ఎల్లప్ప, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల వీరాహన్మాన్ దేవాలయం దినదినాభివృద్ధి



ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

**కౌడిపల్లి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో వెలసిన మహిమానితమైన శ్రీ బాల వీరాహన్మాన్ దేవాలయం దినదినాభివృద్ధి చెంది, ప్రతి శనివారం నాడు భక్తులతో కిటకిటలా డిపోతుంది. ఆలయ ప్రధాన అర్చకులు మెట్టు రాములు శర్మ వేద మంత్రాల నడుమ శ్రీ బాల వీరాహన్మాన్‌కు పంచామృతాభిషేకం నిర్వహిం చ, చందనాలంకరణ చేసిన పిదప1008 తమల పాలకులతో శ్రీ ఆంజనేయల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శనివారం నాడు గ్రామ భక్తులతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంకు విచ్చేసి, ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించడం ఆనవాయితీగా మారిపోయింది. ఆలయ ప్రధాన ఆర్చకులతోపాటు గ్రామస్థులు విఠల్, కారోబార్, భక్తులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ

**వెల్దుర్తి, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ఉచితంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మహేష్‌రెడ్డి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పర్యావరణాన్ని కపాడటం కోసం ప్రజలందరూ మట్టి గణపతులనే పూజించాలని, నవరాత్రుల్లో మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మట్టి వినాయకులను అందజేస్తున్న దృశ్యం



శేఖాపూర్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## గొల్ల కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత

### ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

**జహీరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** గొల్ల, కురుమలు ఆర్థికంగా స్థిరపడేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెలను పంపిణి చేస్తోందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అన్నారు. మండలంలోని శేఖాపూర్‌లో శనివారం 10 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలకు అండగా కులవృత్తులకు అధిక ప్రాదాన్యత ఇస్తున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. గొర్రెలను ప్రభుత్వం అందచేస్తుండటం తో గొల్లలు లబ్ధిపొందడంతో పాటు మాంసం అమ్మకంలో రాష్ట్ర ఎగవ భాగంలో నిలుస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిణి చేసిన గొర్రెలకు ఇన్సురెన్స్, దాణా సదుపాయాలను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ విజయకుమార్, మొగుడంపల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు నారాయణ యాదవ్, మాజీ జడ్పీటిసి సభ్యులు మాణికమ్మ, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు శెట్టి రాథోడ్, సురేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు చిన్నరెడ్డి, దిడిగి కరణ్, విజయ్, చందర్, రాజు, రాజు, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు హీరు రాథోడ్, తాలుకా గొల్ల కుర్మ యాదవ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు, యువత అధ్యక్షులు రజ రమేష్, డాక్టర్ పెద్ద గొల్ల నారాయణ, సంఘం నాయకులు శ్రీనివాస్, తుల్జారాం, లక్ష్మణ్, మహబూబ్, అజీమ్, గొల్ల శంకర్, వెంకటి, నర్సింహారెడ్డి, విజేందర్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ బహిరంగ సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుంది

### నాగులగారి మల్లేశంగౌడ్, రంగంపేట సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్
పాల్గొన్న రంగంపేట సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, నాయకులు

**శివ్వంపేట, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** తుక్కుగూడలో నేడు జరగబోయే సోనియా గాంధీ బహిరంగ సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, రంగంపేట సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డిలు అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రమైన కొల్చారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు సమాశమయ్యారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్, ప్రవీణ్‌రెడ్డిలు మాట్లాడుతూ నేడు జరగబోయే తుక్కుగూడ విజయభేరి సభకు కొల్చారం మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను అధిక సంఖ్యలో తీసుకెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియమ్మ రుణం తీసుకొనే అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, పట్లోరి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, పైతర సర్పంచి సంతోష ఎల్లేశం, సంగాయిపేట మాజీ సర్పంచి బద్య నాయక్, బీసీ సెల్ మండల నాయకులు ఆగంగౌడ్, రంగంపేట పీఏసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాందాపూర్ జనార్ధన్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సయ్యద్ అక్రమ్, మండల కోశాధికారి చందపురం మధుసూదన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మమమ్మద్ సమీర్, అశోక్, ఆయుబ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సమవర్ధవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధం : ప్రిన్సిపాల్



విద్యార్థులతో ఓటు హక్కు, మాక్ పోలింగ్ నిర్వహించిన ప్రిన్సిపాల్

**కౌడిపల్లి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య దేశాలలో సమవర్ధవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు ఒక వజ్రాయుదంగా ఉపయోగించుకొని, ఏలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా తమ ఓటును వేయాలని కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రామారావు పిలుపు నిచ్చారు. శనివారం నాడు కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం, మాక్ పోలింగ్‌పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట రామారావు మాట్లాడుతు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని, సరియైన రాజకీయ నాయకులకు ఓటు వేసి గెలిపించుకోని అభివృద్ధికి నాంది పల్కాలని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలను పరిపుష్టం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. విద్యార్థులు తమ గ్రామ ఎన్నికల ప్రచారంలో బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు పొందాలని, ఓటర్ల లీస్టులో తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. కాగా కళాశాల యందు నిర్వహించిన మాక్ పోలింగ్‌లో నాయకులుగా నిలబడిన విద్యార్థులు తొటి విద్యార్థులకు ఎన్నికల ప్రచారం,ఓటు హక్కును వినియోగం చుకోవడానికి ఏవిధంగా పిలుపు నివ్వాల్లో తెలిపారు. మాక్ పోలింగ్ తోపాటు ఓట్ల లెక్కింపు కూడా ఏవిధంగా నిర్వహించబడును వివరించి, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రస్తుతం ఉన్న ప్రభావాన్ని ప్రత్యక్షంగా విద్యార్థులకు అవగహన కల్పిం చారు. ఈయన తోపాటు ఆధ్యాపకులు, విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

## రోడ్ల సమస్యలపై కదిలిన కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న మ్యాడం బాలకృష్ణ

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని రోడ్ల సమస్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. శనివారం పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు పట్టణంలోని సాయినగర్‌లో కలియ తిరిగారు. రోడ్ల సమస్యలు తెలుసుకున్నారు. గుంతలమయమైన రోడ్లను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ చేతకానితనం వల్ల సమస్యలు పెరిగాయని ఆరోపించారు. డ్రైనేజీ సమస్యలు ఎక్కువయ్యాయని, ఫలితంగా దోమలు వ్యాపించి ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఔతారం నర్సింలు, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, విక్రమ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సల్మాన్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భరత్‌గౌడ్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సంతాప్ప, సంజీవ్, దేవిప్రసాద్, ఎమ్మార్పీఎస్ బాలరాజు, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్‌చౌదరి, చిన్నశంకరంపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మదూరు నవీన్, మహిపాల్, నవీన్, బాలరాజుగౌడ్, కోటిరాజు, మధుసూదన్, రాజు, మధుతారక్, శాలిపేట రాజు, అనిల్, రాజు, జాకీర్, శ్రీకాంత్, జాకార్య, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ జార్జ్

## గణేష్ ఉత్సవాలను శాంతీయుతంగా జరుపుకోవాలి

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యుత్ కోసం విద్యుత్ శాఖ అధికారుల పర్మిషన్ కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. నిమజ్జన సమయంలో డీజీ సౌండ్‌కు అనుమతి లేదని, రాత్రి దాదాపు 10 గంటల వరకు నిమజ్జనాలను పూర్తి చేసేలా మండలపాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని అన్నారు. నిమజ్జనోత్సవం సమయంలో మిలాద్ ఉన్ నబీ పండుగ కూడా వస్తుందని, ప్రజలందూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సునీ, ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్, సర్పంచి సత్యనారాయణ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళి పంతులు, ఎంపీటీసీలు దత్తు, వీణ సుభాష్‌గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంట్ల రాములు, రైతుబంధు అధ్యక్షులు సురేష్‌గౌడ్, హిందూ, ముస్లిం సంఘాల పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు శంకర్‌గౌడ్, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే బీసీ,మైనార్టీలకు లక్ష సహాయం

### మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



చెక్కులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ బంధు మైనార్టీలకు లక్ష రూపాయల చెక్కులను జీఎంఆర్ కన్వర్షన్‌లో మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే జీఎంఆర్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పంపిణీ చేశారు. వివిధ వార్డులకు చెందిన 28 మందికి బీసీ బంధు, ఆరు మందికి మైనార్టీ లక్ష రూపాయలు లబ్ధి పఒందారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు 34 లక్షల రూపాలయ విలువైన చెక్కులను మున్సిపల్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల, మైనార్టీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష రూపాయల సహాయం పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. బీసీ బంధు, మైనార్టీ కుటుంబాలకు లక్ష రూపాయల సహాయం, దళిత బంధు, గృహలక్ష్మీ, ఇలా అనేక పథకాలతో ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, చంద్రకళ గోపాల్, జగదీష్, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనుస్, చౌటకూర మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వినాయక మండపం ప్రారంభించిన చైర్మన్

వినాయక మండపాన్ని ప్రారంభించిన అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు రూపశ్రీ కౌంటిలో స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి 5 లక్షల రూపాయల విరాళంతో ఏర్పాటు చేసిన మంటపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ, ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాల ని కోరారు. మున్సిపల్ తరపున అన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు చంద్రకళ గోపాల్, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావంతో పండుగలు జరుపుకోవాలి

### పాపన్నపేట ఇంచార్జి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** పండుగలు మన సంప్రదాయాలకు ప్రతీక అని, వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను సోదరభావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పాపన్నపేట ఇంచార్జి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, కొల్చారం ఏఎస్ఐ తారాసింగ్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాపన్నపేట ఇంచార్జి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాంతి కమిటీ సమావేశానికి వినాయక మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు, వివిధ కుల సంఘాల నేతలు, యువకులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఏఎస్ఐ తారాసింగ్‌లు మాట్లాడుతూ వినాయక చవితి, అలాగే ముస్లిం సోదరుల మిలాద్ ఉన్ నబీ వేడుకలు కలిసి వస్తున్న నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినాయకుల విగ్రహాల ప్రతిష్టాపనతో పాటు నిమజ్జనాల వరకు గ్రామంలో సోదరభావంతో కలిసి మెలిసి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాల న్నారు. విగ్రహాల ఏర్పాటు కోసం ప్రజల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయకూడదని, మండపాల వద్ద డీజేల పెట్టకూడదని, ప్రజలకు అసౌకర్యం కల్పించకూడదన్నారు. విద్యుత్ శాఖ వారికి డీడీ సమర్పించాలని, మండపాలు ఏర్పాటు చేయాలంటే పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనుమతులు అందిన తరువాతే ఏర్పాటు చేయాలన్నారు.

## మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ హరికృష్ణ,
మాజీ సర్పంచి స్రవంతి నవీన్‌గుప్త

**శివ్వంపేట, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన ఇసుగారి పాండు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా శుక్రవారం ఉదయ తెల్లవారు జామున మృతి చెందడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఇసుగారి అంజయ్య కుమారుడు లారీ నడుపుతూ భార్య పిల్లలతో హైదరాబాద్ నగర శివారులో జీవనం గడుపుతున్నారు. అనారోగ్యంతో అత్తగారింట్లో చికిత్స పొందుతున్నాడు. అకస్మాత్తుగా శుక్రవారం రాత్రి చనిపోవడం జరిగింది. మృతుడు ఇసుగారి పాండుకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం అంత్యక్రియలకు పెద్దఎత్తున బంధుమిత్రులు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, మాజీ సర్పంచి పులిమామిడి స్రవంతి నవీన్‌గుప్త, కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి కీర్తన హనుమంతరావుతో పాలు పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఎంపీపీ హరికృష్ణ 10 వేల రూపాయలు, మాజీ సర్పంచి స్రవంతి వనీన్‌గుప్త 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.



నర్సింలు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న క్రాంతి కిరణ్

## నర్సింలు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**చౌటకూరు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** అకస్మాత్తుగా మృతి చెందిన మండల కేంద్రమైన చౌటకూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత కోల్వూర్ నర్సింలు భౌతిక కాయానికి శనివారం ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నివాళులు అర్పించారు. కోల్వూర్ నర్సింలు అకస్మాత్తుగా తిరిగిరాని లోకాలకు చేరిపోయినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని పార్థీవ దేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శివకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి డ్రామా పోటీలు నిర్వహించగా కొడపాక పాఠశాల ప్రథమ స్థానాన్ని, కెజిబివి ద్వితీయ స్థానాన్ని, నాగసాన్‌పల్లి ఉన్నత పాఠశాల తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నాయి. ఈ సందర్భంగా నోడల్ అధికారి అంజాగౌడ్ మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, అందుకు కృషి సల్పిన ఉపాధ్యాయులను నోడల్ అధికారి ప్రత్యేకంగా అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీనివాస్, దేవయ్య, యశోద, జరీనా, సత్యనారాయణ, ప్రసాద్‌రెడ్డి, రేఖలు వ్యవహించారన్నారు. మంగ నర్సింలు, వీరేశం, రజాక్ మియా, బాబర్, రేణుక, జ్యోతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## 21న రైసు మిల్లు లీజుకు వేలం

**పాపన్నపేట, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైస్ మిల్లును లీజుకు ఇవ్వనున్నట్లు సంఘం అధ్యక్షుల త్యార్ల రమేష్ గుప్తా పేర్కొన్నారు. ఈ నెల 21వ తారీఖున మిల్లు లీజుకు ఇచ్చేందుకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు లీజు వేలంలో పాల్గొని రైస్ మిల్లును వేలంలో పొందాలని చైర్మన్ రమేష్ గుప్తా సూచించారు.

## లబ్దిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే

**కంగ్టి, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** విద్యుద్ఘాతంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి చెక్కులు అందించారు. మండలంలోని భీంరా పంచాయితీ పరిధిలోని పత్తు నాయక్ తండాకు చెందిన రాథోడ్ వెంకట్ నాయక్ ఇటీవల గుర్రంతో పాటు తను విద్యత్ ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ మంజూరు చేసిన 5లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మృతుడి భార్య వాలుబాయికి అందచేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, గ్రామ సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, నాయకులు చంద్రశేఖర్, కొమ్ము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



పీఏ శ్రీశైలంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు శనివారం ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు ముందుగానే అక్కడికి చేరుకొని తాళాలు వేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎక్కడున్న ఇక్కడికి రావాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు బైఠాయించి పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ గతంలో అంగన్వాడీ టీచర్లను చంద్రబాబు నాయుడు గుర్రాలతో తొక్కించి అదోగతి పాలయ్యాడని, అలాగే ఈ ప్రభుత్వం కూడా చేస్తుందని, వీరికి కూడా ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్తారని అన్నారు.అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ మేము 60 సంవత్సరాల వరకు మాత్రమే సర్వీస్‌లో ఉంటామని, ఐదు సంవత్సరాలను తగ్గించాలన్నారు. ఒక ఉద్యోగి చనిపోతే 20 వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని, ఇం తకంటే ఘోరం ఎక్కడైనా ఉంటుందా అన్నారు. ఇప్పటి వరకురావా ల్సినటువంటి డబ్బులను వెంటను చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో వర్క్ చేయకుండా మాన్యువల్‌గా వర్క్ చేసే విధానంగా ఉంచాలని డిమాండ్ చేశారు.మెదక్ నియోజకర్గం నుండి పెద్దఎత్తున అంగన్వాడీలు వచ్చి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం, బాలమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన అవగాహన

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలంగాణ విమోచన దినోత్సవ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ కన్వీనర్ మాట్లాడుతూ విద్యార్థులకు మరుగున పడిన చరిత్రను మెరుగుపెట్టి చూపించారు. నిజాం పాలన నుండి విమోచన పొంది 76 సంవత్సరాలు కావస్తున్నా దురదృష్టవశాత్తు అనుకున్న మేర అభివృద్ధి జరగట్లేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శశికాంత్, ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ విజ్ఞాన్, సత్య, వంశీ, గణేష్, బద్రి, భాను తదితరులు పాల్గొన్నారు.